
వీకెండ్ కావడంతో ఆదివారం సందర్శకులతో కిటకిటలాడుతున్న నుమాయిష్

నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | HYDERABAD


శ్రీశ్రీ హోంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి




## గ్రేటర్ @ 34.0 డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న గాలులు ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.0, కనిష్ఠం 18.0 డిగ్రీలు, గాలిలో తేమ 34 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# వ్యాపారులే లక్ష్యం

## స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైన బల్దియా

### ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోని వారిపై నజర్

### భారీ పెనాల్టీకి చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ): గ్రేటర్‌లో వాణిజ్య సంస్థలు, వ్యాపారస్తులను జీహెచ్ఎంసీ టార్గెట్ చేసింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. ప్రాపర్టీ ట్యాక్స్ డేటాబేస్ ఆధారంగా 317033 మంది కమర్షియల్ కేటగిరీలో ఆస్తిపన్ను చెల్లిస్తుండగా, వీరంతా ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాలోకి రావాల్సి ఉంది. కానీ కేవలం లక్షా 9వేల 702 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లిస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలోనే ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోని వారిపై బల్దియా దృష్టిసారించింది. గ్రేటర్‌లో వ్యాపార సంస్థలకు జీహెచ్ఎంసీ జారీ చేసే ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన జనవరి 31తో ఉచితంగా రెన్యువల్ చేసే గడువు ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి రెన్యువల్ చేసుకోనున్న ట్రేడ్ లైసెన్స్‌లపై ఫీజులో 25 శాతాన్ని పెనాల్టీ వేయనున్నారు. మార్చి ప్రారంభం నుంచి నెలాఖరు వరకు 50 శాతం జరిమానాగా వసూలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి రెన్యువల్ చేసుకునే వ్యాపారుల నుంచి చెల్లించాల్సిన ట్రేడ్ ఫీజులో వంద శాతం జరిమానా వసూలు చేయనున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 30 సర్కిళ్లలో ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి వారి నుంచి ముక్కు పిండి ఫీజులు వసూలు చేయనున్నారు. మెడికల్ ఆఫీసర్, లైసెన్సింగ్ ఆఫీసర్ ప్రతి రోజూ కనీసం 20 వ్యాపార సంస్థలను నేరుగా కలిసి ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్‌కు చర్యలు చేపట్టనున్నారు.




# ఇంటింటికీ తాగునీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే

బడంగ్‌పేట, ఫిబ్రవరి 2: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ శ్రీశ్రీ హోం కాలనీలో ఆమె పర్యటించారు. ఓపెన్ జిమ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరికరాలను పరిశీలించారు. కాలనీల్లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం నియోజక వర్గంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ రూ. 375 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి సమస్య లేకుండా పోయిందన్నారు. గతంలో వారానికోసారి మంచి నీళ్లు ఇచ్చే వారన్నారు. ఇప్పుడు రోజు తప్పి రోజు వస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో నీటి సమస్య రాకుండా 9 రిజర్వాయర్లు నిర్మించినట్లు చెప్పారు. చెరువులోకి మురుగు నీరు పోకుండా ఉండటానికి ఎస్ఎన్‌డీపీ నిధులతో నాలాల నిర్మాణానికి వంద కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేయడం ద్వారా పనులు మధ్యంతరంగా ఆగిపోయిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

### కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చేందుకు

# చైన్ స్నాచింగ్ నాటకం



ఘట్‌కేసర్, ఫిబ్రవరి 2: కొడుకుకి తెలియకుండా కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చేందుకు ఓ తల్లి చైన్ స్నాచింగ్ నాటకమాడి.. చివరికి పోలీసులకు దొరికిపోయింది. స్థానికులు, ఘట్‌కేసర్ పోలీసుల కథనం ప్రకారం.. అవుషాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు (60) తన కూతురికి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో సాయం చేయాలనుకున్నది. తన వద్ద డబ్బులు లేకపోవడంతో బంగారు పుస్తెల తాడు అమ్మాలనుకున్నది. అయితే విషయం కొడుకుకు తెలుస్తుందని భయపడింది. దీంతో చేసేది లేక చైన్ స్నాచింగ్ నాటకానికి తెరలేపింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి మెయిన్ రోడ్డుకు చేరుకున్నది. తన మెడలోని 3 తులాల పుస్తెల తాడును ఆగంతకులు ఎత్తుకుపోయారని కన్నీరుపెట్టింది. స్థానికులు రాగానే డయల్ 100కు ఫోన్ చేసి..విషయం చెప్పింది. రంగంలోకి దిగిన పోలీసులు..ఆగంతకుల కోసం గాలించారు. వృద్ధురాలిని ప్రశ్నించగా, పొంతనలేని సమాధానం చెప్పింది. దీంతో సీసీ కెమెరాలను పరిశీలించగా, దొంగల జాడ కనిపించలేదు. దీంతో ఆ వృద్ధురాలిని గట్టిగా మందలించడంతో కూతురి ఆర్థిక ఇబ్బందులు తీర్చేందుకు తాను ఇలా చెప్పానని పేర్కొంది. కాగా, తప్పుదోవ పట్టించిన వృద్ధురాలిపై చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంతా తానై..

### బడంగ్‌పేట కార్పొరేషన్‌లో డీఈ తీరుపై విమర్శలు




బడంగ్‌పేట: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల మధ్య వివాదం ముదిరింది. 32 డివిజన్లపై డీఈ జ్యోతి ఆధిపత్యం సాగిస్తూ..వస్తున్నారు. కార్పొరేషన్‌లో ప్రస్తుతం ముగ్గురు డీఈలు ఉన్నారు. యాదయ్య, నర్సింహ రాజు, జ్యోతి..వీరు 32 డివిజన్ల పరిధిలో ఉన్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి.32 డివిజన్లకు ఏఈ వినీల్ గౌడ్ ఒక్కరే ఉన్నారు. అయితే ఏఈలు చేయాల్సిన పనులన్నీ డీఈ జ్యోతి చేస్తున్నారు. అభివృద్ధి పనులకు అంచనా వేయాలన్న, టెండర్ వేయాలన్నా..ఏఈ తప్పని సరిగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఏఈ స్థానంలో డీఈ జ్యోతి సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. డీఈ అంతా తానై కార్పొరేషన్‌లో తనదైన ముద్ర వేసుకున్నారు. ఏఈ చేయాల్సిన పనులు కూడా డీఈ చేయడంతో గొడవ నడుస్తున్నది. ఏఈ వినీల్ గౌడ్ చూస్తున్న డివిజన్లను కూడా తొలగించి.. డీఈ చూడటంతో మరింత వివాదం ఏర్పడింది. కొంతమంది కాంట్రాక్టర్లను తన చాంబర్‌లో కూర్చోబెట్టుకోవడం, మరికొంత మంది కాంట్రాక్టర్లతో కనీసం ఫోన్లు చేసినా మాట్లాడక పోవడం, సమయం ఇవ్వకపోవడం వంటివి చేస్తుండటంతో సదురు డీఈపై అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. కాగా, కమిషనర్ సరస్వతి డీఈ, ఏఈలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారుల మధ్య నెలకొన్న వివాదాలపై అడిగి తెలుసుకున్నారు. డివిజన్లను అందరూ సమానంగా చూసుకోవాలన్నారు. అందుకు డీఈ జ్యోతి అంగీకరించలేదు. అన్ని తానే చూస్తానని చెప్పడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 డివిజన్లు నర్సింహ రాజు, 16 డివిజన్లు డీఈ జ్యోతి చేసుకోవాలని తెలిపారు. 32 డివిజన్లను ఏఈ వినీల్ గౌడ్ చూస్తారని చెప్పారు. ఏఈ పనిచేయలేరని కమిషనర్ ముందు డీఈ ప్రస్తావించారు. దీంతో కమిషనర్ ముందే లొల్లి మొదలైంది . కాగా, బడంగ్‌పేటలో జరుగుతున్న తతంగం చూసి డీఈ యాదయ్య తప్పుకున్నారు. తాను కూడా వెళ్లిపోతానని డీఈ నర్సింహ రాజు కమిషనర్‌కు స్పష్టం చేశారు.

# మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలోకి

### సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

మేడ్చల్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలోని మున్సిపాలిటీలు బల్దియా పరిధిలోకి తెచ్చేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. పీర్జాదీగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్, నిజాంపేట కార్పొరేషన్లు ఉండగా, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇటీవలే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు పాలన గడువు ముగిసింది. గడువు ముగిసిన తర్వాత స్థానిక సంస్థలకు ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి ఎన్నికలు నిర్వహించకుండా జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నది. కాగా, ప్రత్యేక కమిటీ నివేదిక ఇచ్చేందుకు సుమారు 10 నెలలు పడుతుందని, అప్పటి వరకు జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు ముగియనున్నది. ఈ క్రమంలో జిల్లాలోని 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేలా చర్యలు తీసుకోనున్నారు.

### ప్రత్యేక అధికారుల నియామకంతో..

జిల్లాలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలకవర్గం పదవి కాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఇటీవలే మున్సిపాలిటీల్లో పాలక వర్గం వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశాయి. ప్రారంభోత్సవాలు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా ఏ మేరకు చర్యలు తీసుకోనున్నారు అన్నది వేచి చూడాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీలకు నిధులు మంజూరు కాలేదని, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఆస్తిపన్నులు, ట్రేడ్ లైసెన్స్‌ల ఆదాయం పైనే ఆధారపడినట్లు మున్సిపల్ కమిషనర్ల ద్వారా తెలుస్తున్నది. ఆస్తిపన్నులను వంద శాతం వసూళ్లు చేసి మున్సిపాలిటీల్లో ఉండే సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో అధికారులు ఉన్నారు. పాలక వర్గం లేకపోతే సమస్యలపై అధికారుల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఏదీ ఏమైనప్పటికీ మున్సిపాలిటీలకు ఎన్నికలు ఉండే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

# అర్జెంట్ అయితే ఎక్కడికెళ్లాలి..?

## మలమూత్ర విసర్జనకు గ్రేటర్‌లో మరుగుదొడ్ల కరువు

- **ప్రస్తుతం రికార్డులో 1857లో పబ్లిక్ టాయిలెట్లు..**
- **పనిచేస్తున్నవి 1385 మాత్రమే**
- **472 చోట్ల వినియోగంలో లేవని గుర్తింపు**
- **అందుబాటులో ఉన్నవి సైతం అపరిశుభ్రంగానే**
- **అధికారుల నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం**
- **స్వచ్ఛ ర్యాంకుల ప్రకటన నేపథ్యంలో సవాల్‌గా మారిన పబ్లిక్ టాయిలెట్ల అంశం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ): జీహెచ్ఎంసీలో వందకు వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా సాధించాలనే లక్ష్యానికి అధికారులు నీళ్లొదిలారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడీఎస్ ప్లస్ ప్లస్) నగరంగా హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగా..ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్, వాటర్ ప్లస్, స్వచ్ఛ హైదరాబాద్ వంటి ర్యాంకులతో హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. కానీ గడిచిన ఏడాది కాలంగా టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కనిపించని పబ్లిక్ టాయిలెట్లకు బిల్లులు, వినియోగించని మరుగుదొడ్లకు నిర్వహణ వ్యయం చెల్లించడం జీహెచ్ఎంసీకే చెల్లింది. ప్రతి అరకర కిలో మీటరు రద్దీ రోడ్లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. ప్రస్తుతం ఆరు జోన్లలో 4826 సీట్లలో 1857 పబ్లిక్ టాయిలెట్లను మాత్రమే నిర్మించినట్లు లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా 1385 చోట్ల మాత్రమే టాయిలెట్లను వినియోగిస్తున్నట్లు అధికారులు కమిషనర్‌కు నివేదిక ఇటీవల అందజేశారు. అంటే 472 చోట్ల టాయిలెట్లు వినియోగంలోకి లేవని, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆ నివేదికలో పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ ఇలంబర్తి సీరియస్ అయినట్లు తెలిసింది. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ర్యాంకుల ప్రకటన సందర్భంగా సర్వే జరుగుతున్న దరిమిలా పబ్లిక్ టాయిలెట్లను నిర్వహణ అంశాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ టాయిలెట్ల అన్నింటిని వినియోగంలోకి తీసుకు రావాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




### ప్రజాధనం వృథా

టాయిలెట్ల క్షేత్రస్థాయిలో లేకున్నా వాటి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నట్లు, ఇందులో కొన్ని ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లలో సగానికి పైగా వినియోగంలో లేవని, కొన్ని చోట్ల గాయబ్ అయ్యాయని, బిల్లులు చెల్లింపులు మాత్రం యథావిధిగా జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల నల్లాలు, డోర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవ్వడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే వారికి 'అర్జెంట్ ' అయితే ఎక్కడికి వెళ్లాలో అర్థం కానీ పరిస్థితి నెలకొనడం విచారకరం.

### నీళ్లు ఉంటలే..క్లీన్ చేస్తలే

ఆర్టీసీ బస్టాప్‌లు, ఫుట్‌పాత్‌లు , పార్కుల వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్లలో చాలా వరకు ప్రస్తుతం కనిపించడం లేదు. వాస్తవానికి కమర్షియల్ ఏరియాల్లో ఉండే టాయిలెట్లను రోజుకు నాలుగు సార్లు, నాన్ కమర్షియల్ రోజుకు కనీసం మూడు సార్లు టాయిలెట్లను క్లీన్ చేయాల్సి ఉంది. డైలీ క్లీనింగ్ చేస్తున్నారా? అంటే లేదనే స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని టాయిలెట్లకు కనీసం డోర్లు కూడా ఉండడం లేదని చెబుతున్నారు. వీటికి తోడు టాయిలెట్లలో వాటర్ కూడా అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. 'పే అండ్ యూజ్' , బస్టాప్‌ల వద్ద ఉండే సులభ్ కాంప్లెక్స్‌లను ఎక్కువగా వినియోగిస్తుండడం గమనార్హం.

### అమలు కానీ స్వచ్ఛ భారత్ మిషన్ మార్గదర్శకాలు

వాస్తవంగా స్వచ్ఛ భారత్ మిషనర్ (పట్టణ) మార్గదర్శకాల ప్రకారం పబ్లిక్ టాయిలెట్లు మార్కెట్లు, రైల్వే స్టేషన్లు , పర్యాటక స్థలాలు, కార్యాలయ సముదాయాల సమీపం, ప్రయాణ ప్రదేశాల్లో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి. గ్రేటర్‌లో 2వేల వరకు పబ్లిక్ టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలి. కానీ 1385 మాత్రమే ఉండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

# 4 రాష్ట్రాలు.. 80కిపైగా కేసులు..

## 28 కేసుల్లో మోస్ట్‌వాంటెడ్.. బత్తుల ప్రభాకర్ నేర ప్రస్థానమిది




- **దోచుకున్న సొత్తుతో జల్సాలు**
- **ఖైదీని చంపేందుకు ప్లాన్**
- **నిఘా పెట్టి..పట్టుకున్న మాదాపూర్ సీసీఎస్**
- **మూడు గన్‌లు... 451 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం**
- **కేసు వివరాలు వెల్లడించిన డీసీపీ వినీత్**

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 2: బత్తుల ప్రభాకర్ తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నాలుగు రాష్ట్రాల్లో 80కి పైగా కేసుల్లో నిందితుడని, 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. ప్రీజం పబ్ కాల్పులు కలకలంతో అతడ్ని అదుపులోకి తీసుకున్న సైబరాబాద్, మాదాపూర్ సీసీఎస్ పోలీసులు.. నిందితుడి ఇంట్లో సోదాలు నిర్వహించి మూడు గన్‌లు, 451 రౌండ్ల బుల్లెట్లు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 62,000 నగదు, ఓ ఎలక్ట్రికల్ రాడ్‌కట్టర్ యంత్రం, ఓ ఐరన్ రాడ్, ఎలక్ట్రికల్ ఎక్స్‌టెన్షన్ బాక్స్, కటింగ్ బ్లేడ్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సైబరాబాద్ క్రైం డీసీపీ నర్సింహులుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు.

### 2013 నుంచి ...

చిత్తూరు జిల్లా, సోమలధరి మండలం, వడ్డెపల్లి ఇరికిపెంట గ్రామానికి చెందిన బత్తుల ప్రభాకర్ 2013లో తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలతో నేర వృత్తిని ప్రారంభించాడు. చోరీ సొత్తుతో ఖరీదైన పబ్బులు, జిమ్‌లు, హోటళ్లకు తరచూ వెళుతూ.. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డాడు. నాలుగు రాష్ట్రాల్లో 80కి పైగా కేసుల్లో నిందితుడిగా, 28 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని ఓ అపార్టుమెంట్‌లో స్నేహితుడి పేరుతో అద్దెకు ఉంటున్న బత్తుల ప్రభాకర్‌పై నిఘాపెట్టిన మాదాపూర్ సీసీఎస్ పోలీసులు.. శనివారం ప్రీజం పబ్ దగ్గర అతడి కోసం కాపుకాసి పట్టుకున్నారు. ఈ క్రమంలో అతడు పోలీసులపైకి రెండు రౌండ్లు కాల్పులు జరపగా, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి ఎడమ పాదానికి గాయమైంది. నిందితుడి నుంచి మొత్తం మూడు గన్లు, 451 రౌండ్ల బుల్లెట్లు, మూడు సెల్‌ఫోన్లు, రూ.62,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.



### ఖైదీని చంపేందుకు...

విశాఖపట్నం సెంట్రల్‌జైలులో ఉన్నప్పుడు అక్కడ ఉన్న మరో ఖైదీకి బత్తుల ప్రభాకర్‌కు మధ్య వైరం పెరిగి ద్వేషంగా మారిందని, దీంతో ఎలాగైనా జైలు నుంచి తప్పించుకొని సదరు ఖైదీ విడుదలయ్యాక అతడిని హతమార్చాలని వలపన్నినట్లు డీసీపీ తెలిపారు. బీహార్ నుంచి మూడు దేశవాళీ గన్‌లు, 453 రౌండ్ల బుల్లెట్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. జైలుకు వెళ్లక ముందు ఇండ్లలో చోరీలు చేసిన ప్రభాకర్.. ఆ తర్వాత కేవలం ఇంజినీరింగ్ కళాశాలలు, విద్యా సంస్థలను లక్ష్యంగా చేసుకొని రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఈ క్రమంలో సైబరాబాద్ పరిధిలో రూ. 2.5 కోట్లు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం, ఎవరితోనూ ఎక్కువగా కలవడం అతడి ఇష్టం ఉండదని, ఒంటరిగా తిరుగుతూ చోరీలు చేయడం.. వచ్చిన డబ్బులతో ఖరీదైన పబ్బులు, హోటళ్లలో జల్సాలు చేయడం, ఖరీదైన జిమ్‌లకు వెళ్లడం హాబీగా మార్చుకున్నాడని డీసీపీ తెలిపారు.